క్లుప్తంగా

అధికారుల పర్యటనతో దుకాణాల మూత



అమరాపురం: అమ్మకం పన్ను అధికారులు వస్తారనే సమాచారంతో మండల కేంద్రం లోని వాణిజ్య వ్యాపారులు బుధవారం దుకాణాలను బంద్ చేశారు. అమరాపురంలో ఏ ఒక్క దుకాణం మధ్యాహ్నం వరకూ తెరవ లేదు. ఇది కర్ణాటక ప్రాంతానికి దగ్గరగా ఉండ డంతో దుకాణాల్లో సక్రమంగా రికార్డులు, నిర్వహించారో లేదు తెలీదుగాని మొత్తానికి ఉన్నతాధికారులు రాకతో మండల కేంద్రంలో దుకాణాలన్నీ మూతపడ్డాయి. అధికారులు వెళ్లిన తరువాత దుకాణాలు వ్యాపారాలను కొనసాగించారు.

డిగ్రీలో ఉత్తమ ఫలితాలు

హిందూపురం: ఎస్కే యూనివర్సిటీ విడుదల చేసిన నాలుగవ సెమిస్టర్ డిగ్రీ పరీక్ష ఫలితాలలో ఎన్ఎస్పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరచినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. బీఎస్సీలో 82 శాతం, బీఏలో 96 శాతం, బీకాంలో 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఉర్దూ, జువాలజీ, మ్యాథ్స్ సబ్జెక్టులలో వంద శాతం ఉత్తీర్ణతను సాధించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిభ కనపర్చిన విద్యార్థినులను, వారిని ప్రోత్సహించిన అధ్యాపకులను అభినందించారు.

28న అన్ని దేవాలయాల్లో పూజలు నిర్వహించండి

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలతో తిరుమల పవిత్రతను అపవిత్రం చేశారని, ఈపాపాన్ని పక్షాళన చేయడానికి వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ సూచనమేరకు ఈనెల 28న నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల్లో పూజలు చేయాలని వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప సూచించారు. వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీలోని వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పూజల్లో పాలుపంచుకోవాలన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు

గోరంట్ల: స్థానిక గిరిజన బాలికల సంక్షేమ పాఠశాల విద్యార్థులకు బుధవారం పీస్ వెల్ఫేర్ సొసైటీ, అరోమ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 250 మంది విద్యార్థినులకు వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 40 మంది విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు తక్కువ ధరకే అద్దాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

30న మున్సిపల్ కౌన్సిల్ మీట్

మడకశిర: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 30న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ మీట్‌ను నిర్వహించనున్నట్లు కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు చెకుముఖి టాలెంట్ టెస్ట్

రొళ్ల: మండల పరిధిలోలని దొమ్మరహట్టి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - 2047 వ్యాసరచన పోటీలను బుధవారం ఎంఈఓ శ్రీధర్ పరిశీలించారు. అదే విధంగా రికార్డులను, కెమిస్ట్రీ ల్యాబ్‌ను పరిశీలించారు. అలాగే జన విజ్ఞాన వేదిక వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మైలారప్ప, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



బోరెడ్డిపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సవిత

పరిగి: రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత బుధవారం మండలంలో పర్యటించారు. బోరెడ్డిపల్లి, విట్టాపల్లి, శీగిపల్లి గ్రామాల్లో దాదాపు రూ.1.50 కోట్ల నిధులతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమి పూజ చేసిన అనంతరం పనులు ప్రారంభించారు. పరిగి నుంచి బోరెడ్డిపల్లికి రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, విట్టాపల్లిలో రూ.57 లక్షలు, శీగిపల్లిలో రూ. 30 లక్షల నిధులతో డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం పైడేటిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాడి.. జీవనాడి

- పాడికి కేరాఫ్‌గా మారిన బసవనపల్లి
- ప్రతి ఇళ్లూ ఆవులతో కళకళ

అతివృష్టి, అనావృష్టితో ఏదో ఒక దశలో పంట నష్టపోవడంతో ఎంతో మంది రైతులకు నష్టాలబాట తప్పేది కాదు. దీంతో విసిగి వేసారిన కొందరు రైతులు వ్యవసాయానికి తోడు పాడి పరిశ్రమ వైపు అడుగులు వేశారు. దీంతో ప్రస్తుతం రైతులకు పాడి జీవనాధారంగా మారింది. ఈ కోవలోకే వస్తారు లేపాక్షి మండలం కే.బసవనపల్లికి చెందిన గ్రామస్తులు. ఇక్కడ ఏ ఇళ్లు చూసినా పాడి ఆవులతో కళకళలాడుతుంటోంది.



ఊరిలోని ఓ కుటుంబం వద్ద ఉన్న పాడి ఆవులు



ద్విచక్ర వాహనంలో గడ్డిని తరలిస్తున్న పాడి రైతు పద్మావతి

లేపాక్షి: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయంపై చాలా మంది రైతులు దృష్టి సారించలేకపోతున్నారు. సకాలంలో వర్షాలు రాకపోవడం, అరకొర వర్షాలకు పెట్టిన పంటలు చేతికి రాకపోవడం, పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు వ్యవసాయ జూదంలో ఓడిపోతునే ఉన్నారు. దీనిపై ఆధారపడిన చేసిన అప్పులు తీర్చలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎంతో మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అయితే దీన్ని అధిగమించడానికి లేపాక్షి మండలంలోని కంచిసముద్రం పంచాయితీ పరిధిలో ఉన్న కే.బసవనపల్లి గ్రామస్తులు పాడి పరిశ్రమను ఎంచుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు.

1300 లీటర్ల దాకా పాలు

బసవనపల్లి గ్రామంలో 65 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబానికి ఐదు, ఆరు పాడి ఆవులకు పైగా ఉన్నాయి. ఈ లెక్కన ఆ గ్రామంలో 500కు పైగా పాడి ఆవులు ఉన్నాయి. ఈ గ్రామం ఉన్న మూడు డెయిరీలకు రోజూ ఉదయం, సాయంత్రం కలిపి 1200 నుంచి 1300 లీటర్లు పాలను పోస్తున్నారు. పాలు ఎక్కువగా ఉండడంతో ఎల్ఆర్, ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ సరి చూసేందుకు అన్‌లైజర్ మిషన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నారు. 90 శాతం మంది రైతులు, ప్రజలు వ్యవసాయం కన్నా పాడి పరిశ్రమ ద్వారానే జీవనం సాగిస్తున్నారు.

రూ.6 లక్షల దాకా పాల బిల్లు

మేలుజాతి పాడి ఆవులను కొనుగోలు చేయడమే కాదు వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంటారు. ఈ గ్రామానికి ప్రతి 15 రోజులకు ఒకసారి రూ. 5.50 లక్షల నుంచి రూ.6 లక్షలు వరకూ పాల బిల్లులు వారి ఖాతాల్లోకి జమ అవుతుంటాయి. అంతేకాకుండా పాడి ఆవులను పోషించడానికి అనువైన షెడ్, పాడి పశువులు ఆరోగ్యం కోసం వైద్య పరీక్షలు చేయించడం, పోషకాహారమైన దాణా, పచ్చిగడ్డిని పెంచుకుంటున్నారు. కుటుంబాలు పోషించుకోవడం, పిల్లలను చదివించడం కోసం, ఆర్థికంగా ఎదగడానికి పాడిఆవులు ఎంతో దోహదపడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వం పాడి ఆవులకు రుణాలు మంజూరు చేస్తున్నా తమ దరిచేరడం లేదని అంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా ఆశించకుండా స్వయం కృషితో పాడి ఆవుల ద్వారా మెరుగైన జీవనం సాగిస్తున్నామంటున్నారు.



అన్‌లైజర్‌లో పాలును కొలుస్తున్న డెయిరీ యజమాని

పాడి ఆవులే మాకు ఉపాధి



పాడి ఆవులే మాకు జీవనాధారం. మా ఇంట్లో నేను నా భార్య నాలుగు పాడి ఆవులను, ఒక లేగ దూడను సంరక్షిస్తున్నాము. పాడి ఆవుల బాగోగులు, వాటికి స్నానాలు, వైద్య పరీక్షలు చేయించడం తప్ప వేరే పనికి పోవడం లేదు. నాలుగు ఆవులకు గాను రెండు పాడి ఆవులు పాలు ఇస్తున్నాయి. ఉదయం 12 లీటర్లు, సాయంత్రం 12 లీటర్లు డెయిరీలకు విక్రయిస్తున్నాము. రోజుకు రూ.750 పాలతో ఆదాయం వస్తోంది. అందులో పశుగ్రాసం, దాణాకు రూ.450 ఖర్చులు పోను మిగిలిన రూ. 300 ఆదాయంగా ఉంది. పాలలో వచ్చిన ఆదాయంతోనే సేద్యం కూడా చేస్తున్నాము.

– నారాయణరెడ్డి, పాడి రైతు, బసవనపల్లి

గ్రాసం కొరత లేకపోతే మంచి ఆదాయం



నాకు నాలుగు పాలు ఇచ్చే పాడి ఆవులు, రెండు లేగ దూడలు ఉన్నాయి. రోజూ 10 నుంచి 12 లీటర్లు పాలను డెయిరీలకు విక్రయిస్తున్నాము. ప్రతి 15 రోజులకు ఒకసారి రూ. 2,500 వరకూ ఆదాయం వస్తుంది. నీరు ఒక పాయింట్ కూడా కలపకుండా డెయిరీలకు వేస్తున్నాం. అయితే పశుగ్రాసం కొరతగా ఉంది. కొంత భూమిని కౌలుకు తీసుకుని అందులో సీమ గడ్డి, ఇతర మేతను పెంచకుని పశువులకు పశుగ్రాసంగా ఉపయోగించుకుంటున్నాము. పశుగ్రాసం కొరత లేకపోతే మంచి ఆదాయం వచ్చేది.

– పద్మావతమ్మ, పాడి రైతు, బసవనపల్లి

ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సోమందేపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులతో అనుచితంగా ప్రవర్తిస్తున్న సీనియర్ అసిస్టెంట్ మధుపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ మంగళవారం కస్తూర్బా పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని జ్వరంతో తల్లిదండ్రులతో కలిసి ఆస్పత్రికి రాగా ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లండని అసహనం వ్యక్తం చేయడం తగదన్నారు. సుదీర్ఘ కాలంగా ఇక్కడే పనిచేస్తూ అనేక మందితో గొడవలకు దిగినట్లు చెప్పారు. ఆస్పత్రిలోనే మద్యం తాగుతూ పనిచేస్తున్న మహిళా సిబ్బందితోనూ అగౌరవంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు విచారణ జరిపి మధుపై సస్పెండ్ చేయకపోతే అవసరమైతే డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం వైద్యుడు హరికి వారు వినతిపత్రం అందజేశారు. కార్యాక్రమంలో ప్రజా సంఘాల నాయకులు హనుమయ్య వెంకటేశులు, రంగప్ప, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి



పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని స్థానిక లక్ష్మీపురం శక్తికేంద్రంలో ఘనంగా నిర్వహించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు నాగేష్ , లక్ష్మీనారాయణ, లింగప్ప, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాల కోసం ఆయన విశేషంగా కృషి చేశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం కొనియాడారు. నాయకులు అరవింద్, జగదీష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాయలసీమ జోనల్ కిసాన్ మోర్చా ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కూడా జయంతి వేడుకలు జరిగాయి.

నూతన పద్ధతులతో అధిక దిగుబడి



అగళి: రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ శేఖర్ నాయక్



లేపాక్షి మండలం కొండూరులో రైతులతో సమావేశమైన అధికారులు

అమరాపురం/అగళి/లేపాక్షి/పరిగి: రైతులు వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. బుధవారం అమరాపురం మండలం హలుకూరు, ఉదుగూరు గ్రామాల్లో ఏఓ మంజునాథ, అగళి మండలలోని ఇనగలూరలో ఏఓ శేఖర్‌నాయక్ , లేపాక్షి మండల పరిధిలోని లేపాక్షి-3, కొండూరు రైతు సేవా కేంద్రాల్లో ఏఓ శ్రీలత ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. అలాగే పరిగి మండలంలోని విట్టాపల్లి గ్రామ సమీపంలో ఏఓ విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. అత్యాధునిక, సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు.

ఘనంగా ఫార్మసిస్ట్ డే



విద్యార్థినులకు బహుమతులు అందజేసిన దృశ్యం

హిందూపురం: ప్రజా ఆరోగ్యం కోసం ఫార్మసిస్ట్ వ్యవస్థ నిరంతం సేవలు అందిస్తూ ఆరోగ్యకరమైన వాతారణానికి కృషి చేస్తోందని హిందూపురం డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి. హనుమన్న అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం - 2024 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హనుమన్న మాట్లాడుతూ ఫార్మసీ విభాగపు విశిష్టతను వివరిస్తూ ప్రపంచాన్ని స్తంభింప చేసిన కరోనా వంటి క్లిష్ట సమయంలో దేశంలోని మెడికల్ షాప్స్ (ఫార్మసీలు) అందించిన సేవలు హర్షణీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.హరీష్ బాబు మాట్లాడుతూ మారుతున్న సమాజ పరిస్థితులు, ప్రపంచ అవసరాల దృష్ట్యా ఫార్మసీ కర్తవ్యం, ప్రజా ఆరోగ్యంలో ఫార్మసిస్టుల ఆవశ్యకతను వివరించారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విభాగధిపతులు శ్రీనివాసులు, సుమతి, హరినాథబాబు కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి



ఎస్పీ బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



హిందూపురం: వేదికపై పాటలు ఆలపిస్తున్న కళాకారులు

పరిగి: తెలుగువాడి గానామృతాన్ని ప్రపంచానికి చాటిన గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని వక్తలు కొనియాడారు. ఎస్పీ బాలు 4వ వర్ధంతి సందర్భంగా పరిగి మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ గంగప్ప, విద్యుత్‌శాఖ ఏడీ వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. తొలుత ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. ఎస్పీబీ.. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ తదితర భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారన్నారు. ఆయన అకాల మరణం అందరినీ కలచివేసిందని చెప్పారు. అనంతరం ఎస్పీబీ అభిమాన కళాకారుల సంఘం అధ్యక్షుడు రామలింగప్ప ఆధ్వర్యంలో గాయకులు పాడిన పాటలు అందరినీ అలరించాయి.

హిందూపురం: స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి మంచు మ్యూజిక్ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్ధంతిని నిర్వహించారు. ఎస్పీబీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ చిత్రాల్లో ఎస్పీబీ ఆలపించిన మధుర గీతాలు కళాకారురులను అలరించాయి. కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, నవీన్‌చంద్ర, అంజప్ప, రాజ్యలక్ష్మి మోహన్, నారాయణ, ఉమర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఈఓకు సన్మానం



డీవైఈఓ రంగస్వామిని సన్మానిస్తున్న కవి జాబిలి చాంద్‌బాషా

పెనుకొండ: జాతీయ భాష హిందీ ప్రాధాన్యత వెలకట్టలేనిదని డీవైఈఓ రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డీవైఈఓ కార్యాలయంలో హిందీ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీవైఈఓని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ కవి, హిందీ భాషోపాధ్యాయుడు జాబిలిచాంద్‌బాషాని సన్మానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: మండల పరిధిలోని కోగిర గ్రామానికి చెందిన గంగాధర్ కుమారుడు రాజు మంగళవారం పావగడ సమీపాన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. రాజు భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నాగలమడక ఆలయ అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్



ఆలయ ప్రణాళిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్

పావగడ: తాలూకాలోని నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యం దేవాలయ అభివృద్ధి పనులకు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి అధునాతన ఆలయంగా తీర్చిదిద్దడానికి కర్ణాటక రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎంవీ వెంకటేశ్ సుముఖత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కమిషనర్‌తో పాటు అధికారుల బృందం బుధవారం నాగలమడక ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయాన్ని క్షుణంగా పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ భక్తులు అందించిన కానుకలు ఇప్పటికే సుమారు రూ.8 కోట్ల నిధులు ఉన్నాయని, వాటితో పాటు ఇక నుంచి భక్తులు అందించే విరాళాలతో వచ్చే ఏడాది ఆగస్టులోగా ఆలయ పునఃనిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఆగమ పండితుల అధ్యక్షురాలు శోభారాణి, ఏఓ సునీల్ తదితర అధికారులు, మాజీ మంత్రి వెంకటరమణప్ప, పీడబ్ల్యూ ఏఈఈ అనీల్‌కుమార్, ఆలయ ధర్మ కర్త నాగభూషణరెడ్డి, తహసీల్దార్ వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సోమందేపల్లి: ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పెడపల్లి బాబా తెలిపారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలో బుధవారం ఆటోడ్రైవర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీల పేరిట రవాణాశాఖ అధికారులు, పోలీసులు వేధింపులకు గురి చేయకూడదన్నారు. ఫిట్‌నెస్, లైసెన్స్ జారీ చేసే అధికారాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పకుండా ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు రాజ్‌గోపాల్, చాంద్‌బాషా, నారాయణ స్వామి మాబూ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలు సద్వినియోగం చేసుకోండి



రూ.70 వేల చెక్కును అందిస్తున్న దృశ్యం

హిందూపురం: పోస్టల్‌శాఖలో బీమా పథకాలతో అత్యవసర పరిస్థితులతో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించవచ్చని చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ఓ.ప్రకాష్ అన్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో బుధవారం ప్రజల వద్దకే పోస్టల్ పథకాలు కార్యక్రమాన్ని చేపట్టారు. హిందూపురంకు చెందిన రహమత్‌బాషా ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆస్పత్రి ఖర్చులకు రూ.70 వేల చెక్కును ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్ ,డాక్టర్ మధుసూదన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పోస్టల్ ఎస్పీయూ విజయ్‌కుమార్, పోస్టుమాస్టర్ మార్కండేయ, ఏఎస్పీ కళ్యాణ్ రామ్, మల్లికార్జున, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



ప్రసాద్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

మడకశిర: అనాథ శవానికి ప్రజా సంఘం నాయకురాలు పవిత్ర అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.... ప్రసాద్ (65) అనే వ్యక్తి మడకశిర పట్టణంలో కొన్నేళ్ల హోటళ్లలో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయన అనాథ. అనారోగ్యంతో మంగళవారం రాత్రి వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని ఓ దేవాలయంలో చనిపోయాడు. స్థానిక ప్రజా సంఘం నాయకురాలు పవిత్ర ముందుకు వచ్చి ప్రసాద్ మృత దేహాన్ని ప్రత్యేక వాహనంలో శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.